క్లుప్తంగా

సీతారెడ్డికి సన్మానం



సీతారెడ్డిని సన్మానిస్తున్న కృష్ణ తదితరులు

బడంగ్‌పేట్: తిరుమల తిరుపతి బోర్డు మెంబర్‌గా నియమితులైన గడ్డం సీతారెడ్డిని ఆదివారం బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బొకేలు అందజేసి శాలువాలతో సీతారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిలకు అభినందనలు తెలిపారు. టీటీడీ సేవలు ప్రజలకు, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ఘనంగా అమ్మవారికి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కందుకూరు: మండలంలోని జైత్వారం, ధన్నారం, కొత్తూర్, మాదాపూర్, నేదునూరు, అగర్‌మియాగూడ, మీర్‌ఖాన్‌పేట, దాసర్లపల్లి గ్రామాల్లో ఆదివారం మల్లిఖార్జున, పోచమ్మ, మల్లన్న బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పుల వాయిద్యాలు, నృత్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆయా గ్రామాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 15వ డివిజన్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కంఠ మహేశ్వర సూరమాంబ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బడంగ్‌పేట నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, మనోహర్, బాలునాయక్, జైహింద్, జంగయ్య, సుధాకర్‌రెడ్డి, లింగం, శ్రీశైలం, నరహరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని అనంతవేణి నగర్ పార్కు స్థలంలో చెట్లు, చెట్లకొమ్మలు పేరుకుపోయి ఇబ్బందికరంగా ఉందని కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఆదివారం పార్కు స్థలంలో పేరుకుపోయిన చెట్లను, పిచ్చిమొక్కలను జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగింపజేశారు. దీంతో కాలనీవాసులందరూ కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బాల నర్సింహ, అశోక్, రాజేశ్, గట్టయ్య, కాశ్యయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ మహాధర్నా

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి, కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదీలాల్ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో నియంత, అరాచక, అవినీతి పాలన కొనసాగుతోందని విమర్శించారు. అవినీతి పాలనను అంతం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మహాధర్నాను ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు భాస్కర్, మల్లయ్య, పెంటయ్య, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

రుణమాఫీపై స్పష్టత ఏది?

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తున్నామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి పక్షం రోజులు గడుస్తున్నా స్పష్టత లేదని ఎంపీపీ కొప్పు సుకన్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 శాతం మంది రైతులకే మాఫీ వర్తించినట్లు స్వయంగా బ్యాంకు అధికారులు చెబుతున్నట్లు ఆమె ఆరోపించారు. ప్రభుత్వ ప్రకటనతో రైతులు రుణాలను చెల్లించలేదు. తీరా చూస్తే వడ్డీలకే రుణమాఫీ సరిపోలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే పూర్తి రుణమాఫీ అమలు చేస్తామని తెలిపారు.

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

"ముగ్గురమ్మల సమ్మేళన, సమన్వయ స్వరూపంగా, శక్తిస్వరూపిణిగా, పల్లె ప్రజలను గాచే గ్రామదేవతగా వెలసిన కల్పవల్లి.. సూర్యగిరి రావిర్యాల ఎల్లమ్మ తల్లి. నేటి నుంచి జరిగే అమ్మవారి 40వ వార్షిక కల్యాణ ఉత్సవాలపై కథనం '

నేటి నుంచి సూర్యగిరి ఎల్లమ్మ 40వ వార్షిక వేడుకలు



రావిర్యాలలోని సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం

తుక్కుగూడ: జిల్లాలోనే అతి పెద్ద ఎల్లమ్మ ఆలయం ... రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం. అమ్మవారి ఇష్టమైన మంగళవారం వందలాది మంది భక్తులతో కిటకిటలాడి విశేష పూజలు అందుకునే అమ్మవారి ఆలయంలో నేటి నుంచి ఈనెల 6వ తేదీ వరకు 40వ వార్షిక బోనాలు, కల్యాణ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో దేవాదాయ ధర్మధాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు జిల్లాతో పాటు, నల్లగొండ, మహబుబ్‌నగర్, జంటనగరాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి దర్శించుకొన్ని మొక్కులు, కానుకులు చెల్లించుకుంటారు. ప్రతి ఏడాది శ్రావణమాసం మూడవ సోమవారం ప్రారంభమై బుధవారం వరకు కొనసాగుతాయి.

కొనసాగుతున్న ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేయడం, ఆలయ ముందు పచ్చని చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉండటానికి బారులు బిగిస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు ఆలయ సమీపంలోని భూములను చదును చేశారు. వచ్చే భక్తులకు మంచినీటి, తదితర వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ఏడాదికోకసారి జరిగే బోనాల ఉత్సవం కనుల పండవగా అత్యంత వైభవంగా జరుగనున్నాయి.

ఉత్సవాలకు ఆహ్వానం

మున్సిపాలిటీలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం 40వ వార్షిక కల్యాణ ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను ఆలయ పాలక మండలి సభ్యులు ఆదివారం మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు జ్యోతి, నాగేశ్వర్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు లక్ష్మయ్యయాదవ్, కౌన్సిలర్ సుమన్ తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి



ఏడాదికోసారి జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణోత్సవాలను విజయవంతం చేయాలి.

– రెడ్డిగళ్ల రత్నం, ఆలయ చైర్మన్

బురదమయంగా ప్రధాన రహదారులు

- పట్టించుకోని అధికార పార్టీ కార్పొరేటర్లు
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి



రాజీవ్ గృహకల్ప రోడ్డును పరిశీలిస్తున్న మల్లారెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ కోమటికుంట చెరువు నుంచి రాజీవ్ గృహకల్పకు వెళ్లే ప్రధాన రహదారి మోకాళ్లలోతు గుంతలు, వాగుల తలపిస్తూ బురదమయంగా ప్రజలు నడవలేని దుస్థితి నెలకొంది. ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుందరీకరణ పేరుతో బీటీ రోడ్లను తవ్వి బురదరోడ్లుగా మార్చారని మండిపడ్డారు. 24,25,26 డివిజన్లకు వెళ్లేందుకు అసలైన ప్రధాన లింక్‌రోడ్డును బురదగుంటలుగా మార్చివేసిన ఘనత బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకే చెల్లిందన్నారు. పది రోజుల క్రితం శంకుస్థాపనలకు విచ్చేసిన మంత్రిని ఇదేరోడ్డులో హడావుడి చేస్తూ తిప్పారు. కనీసం మంత్రి దృష్టికి కూడా తీసుకుపోకుండా దాట వేసే తత్వం బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు ఉండటం సిగ్గుచేటని ఆరోపించారు. ప్రధాన రహదారులు ఇంత అధ్వానంగా ఉన్నా వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం బీఆర్‌ఎస్ నాయకులకు తగదని ఎద్దేవా చేశారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు మేల్కొని రోడ్ల పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే అదే రోడ్డుపై నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు.

ఘనంగా మైసమ్మ తల్లి వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: గాయత్రిహిల్స్ కాలనీలోని మైసమ్మ అమ్మవారి 5వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల నేపథ్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. చండీ హోమం నిర్వహించారు. అమ్మవారికి బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు బాలేశ్‌చారి ఆధ్వర్యంలో అన్నదానం చేయగా.. భక్తులకు మేయర్ వడ్డించారు. ఆలయ కమిటీ సభ్యులు బాలేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నారాయణ గౌడ్, ధనుష్‌రెడ్డి, సుధాకర్, కాలనీవాసులు ఉన్నారు.

బసవ మండప విస్తరణకు కృషి

బీఆర్‌ఎస్ నేత కార్తీక్ రెడ్డి



పూజల్లో పాల్గొన్న కార్తీక్ రెడ్డి

మహేశ్వరం: శ్రావణ ఆదివారం సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీలో బసవ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో బీఆర్‌ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బసవ మండపాన్ని సొంత నిధులతో మరింత విశాలంగా నిర్మిస్తామన్నారు. శ్రీరాంకాలనీలో పెద్ద ఎత్తున కన్నడ సోదరుల కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తున్నా మన్నారు. ఒకప్పుడు చిన్న కాలనీగా ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం మినీ ఇండియాగా మారిందన్నారు. మంత్రి సబితారెడ్డి కాలనీలో మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున మెరుగుపరచడం జరిగిందన్నారు. 18వ వార్డు కౌన్సిలర్ కెంచె లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ పల్లపు శంకర్, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, దూడల శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్, సుధాకర్‌గౌడ్, అర్జున్, సయ్యద్ యూసుఫ్ పటేల్, షేక్ జహంగీర్, నిరంజన్, ఎస్.శాంతకుమార్ పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి



కందుకూరు: మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నేతలు



మహేశ్వరం: బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న మైనార్టీ నాయకులు

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

కందుకూరు: రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని మంత్రి సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బాచుపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల వెంకటేశ్, స్థానిక సర్పంచ్ యాలాల శ్రీనివాస్, ఎంపీటీసీ గుండాల సురేష్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే, కొత్తగూడ నుంచి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్.యాదయ్య, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పి.యాదయ్య, ఎండీ అంజాద్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున వివిధ పార్టీలకు చెందిన నాయకులు మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. లేమూరు నుంచి స్థానిక సర్పంచ్ జి.పరంజ్యోతి, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ఎస్.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికీ మంత్రి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు లచ్చానాయక్, బీసీ సెల్ అధ్యక్షుడు పాండుగౌడ్, నాయకులు కాకి రవి, దేశం కృష్ణారెడ్డి, ఎగిరిశెట్టి నరేష్, ఢిల్లీ శ్రీధర్, బి.వెంకటేశ్, ఎస్.కొండల్‌రెడ్డి, ఎ.సంజీవరెడ్డి, ఎస్.మోహన్‌రెడ్డి, ఢిల్లీ గణేష్, జైపాల్, మహేందర్, వెంకటేష్‌గౌడ్, లక్ష్మణాచారి, చోటే జానీ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

మహేశ్వరం: నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను భారీ మెజార్టీతో గెలుపిస్తాయని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, అసత్య ప్రచారం చేసినా మహేశ్వరం గడ్డపైన ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. మహేశ్వరంలో ప్రతి గ్రామం, గిరిజన తండాకు బీటీ, సీసీ రోడ్లను నిర్మాణం చేసి, ప్రభుత్వ కార్యాలయాలు, డిగ్రీ, పాలిటెక్నిక్, డైట్ కాలేజీ, మోడల్ స్కూల్ అదనపు భవనాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్, ప్రభుత్వ పాఠశాల భవనాలను నిర్మాణం చేపట్టామన్నారు. మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండునాయక్, గ్రామ సర్పంచ్ లావణ్య, ఉప సర్పంచ్ ఎండీ. లతిఫ్‌ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కృష్ణయ్య, కర్రె రాజు, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులను విస్మరించడం తగదు

మంగళి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ రాంబాబు



బడంగ్‌పేట్: నాయీ బ్రాహ్మణులను విస్మరించిన రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని మంగళి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ బొల్లంపల్లి రాంబాబు హెచ్చరించాడు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో నాయీబ్రాహ్మణుల సమావేశానికి ముఖ్య అతిథిగా రాంబాబు హాజరై మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో నాయీ బ్రాహ్మణుడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ కాకపోవడం దురదృష్టకరమన్నారు. నాయీ బ్రాహ్మణులకు మొదటి నుంచి రాజకీయంగా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు నాయీబ్రాహ్మణులకు ఐదు నుంచి ఎనిమిది వరకు ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ కులాన్ని విస్మరించిన రాజకీయ పార్టీలకు ఓట్లు వేయకుండా అడ్డుకుంటామన్నారు. ఇప్పటికైనా నాయీ బ్రాహ్మణులు మేల్కొని పోరాడి రాజకీయ హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు.

వడ్డెరులకు పూర్తి హక్కులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విఘ్నేష్

తుర్కయంజాల్: వడ్డెర వృత్తిదారులకు గుట్టలు, క్వారీలపై పూర్తి హక్కులను కల్పించాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఘ్నేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తుర్కయంజాల్‌లో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడిచిన వడ్డెర వృత్తిదారులు నేటికి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని వాపోయారు. రాష్ట్రంలో 4 వేలకు పైగా సొసైటీలున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని, పనిచేస్తూ మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా కూడా దక్కడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ. 10 లక్షలతో వడ్డెరబంధు పథకాన్ని అమలు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని, ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, మల్లేశ్, సత్యం, అంజి, శ్రీను, శ్రీను, వెంకన్న సైదులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు జనాభా ప్రాతిపదికన సీట్లు

పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు

కడ్తాల్: రానున్న ఎన్నికల్లో పద్మశాలీలకు జనాభా ప్రతిపాదికన ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో పద్మశాలీ శంఖారావం సభ నేపథ్యంలో ఆదివారం కడ్తాల్‌లో పద్మశాలి సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. పద్మశాలీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తున్నాయని ఆరోపించారు. హక్కుల కోసం ఐక్యమత్యంతో ఉద్యమించాలని కోరారు. రాష్ట్రంలో 40 లక్షల మంది పద్మశాలీలు ఉన్నారని, ఒక్కరు కూడా అసెంబ్లీలో లేరని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, శ్రీరాములు, యాదయ్య, వెంకటేశ్, శేఖర్‌నేత, చంద్రప్రకాశ్, పాండు, శేఖర్ తదితరులు ఉన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి



డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తులను స్వీకరిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: యువత అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి కోరారు. ఆమనగల్లులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలో యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు, పట్టణాధ్యక్షుడు మానయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, నాయకులు అనిల్‌గౌడ్, రాజశేఖర్, శ్రీరాములు, మైసయ్య, జంగయ్య, అలీం, కృష్ణ, శ్రీదర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ యాదయ్య తండ్రి జంగయ్య శనివారం కన్నుమూశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు నిరంజన్‌గౌడ్, రాములు, రమేశ్‌నాయక్, శ్రీను, ఆంజనేయులు, గణేశ్‌నాయక్ ఉన్నారు.

నూతన నియామకం

తుర్కయంజాల్: మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుర్కయంజాల్‌కు చెందిన దర్శన్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు మంగమ్మ ప్రకటించారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనకు మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నియామక పత్రాన్ని అందజేశా రు. ఈ సందర్భంగా దర్శన్ మాట్లాడుతూ తనకు పదవిని కట్టబెట్టినందుకు రంగారెడ్డి, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్లు ఐల య్య, సునీల్, కోఆప్షన్ సభ్యులు కుతుబ్ అలీ, పీసీసీ సభ్యులు శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో మహిళలు, నేతలు

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నేవేద్యాన్ని సమర్పించారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. ప్రజలు ఉత్సాహంగా బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.

పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

జీహెచ్ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురంలోని సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో పనులు నత్తనడకన జరుగుతున్నాయని, పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హస్తినాపురం డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ అధికారులతో ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్న ఉద్దేశంతో యుద్ధప్రాతిపదికన కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే కొంత మంది కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులను సకాలంలో పూర్తి చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అలాంటి వారిని ఎట్టిపరిస్థితిలో ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీ నుంచి కేకే గార్డెన్స్ వరకు వెళ్లే దారిలో మూలమలుపు వద్ద గుంత తవ్వి దాదాపు 10 నెలలు గడుస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన అధికారులను పిలిపించి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. మూడు రోజుల్లో పనులను ప్రారంభించకపోతే సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, మరొకరికి ఆ పనులు అప్పగించి పూర్తి చేయించాలని సుధీర్‌రెడ్డి ఆదేశించారు. అంతేకాకుండా పిండిపుల్లారెడ్డి నుంచి ఈదులకంటి గార్డెన్ వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ద్వారకా తిరుమల కాలనీ నుంచి పిండిపుల్లారెడ్డి కాలనీ వరకు వరదనీరు పోయే విధంగా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసి పనులు చేయడానికి సంసిద్ధులై ఉండాలని అధికారులకు సుధీర్‌రెడ్డి సూచించారు. సమావేశంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, డీఈలు కోటేశ్వరరావు, కనకయ్య, ఏఈ హేమూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

- గ్రామాల అభివృద్ధికే ప్రాధాన్యత
- ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

ఇబ్రహీంపట్నం: ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకుడు చెరుకూరి రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం పొల్కంపల్లి, మన్నెగూడ గ్రామాలకు చెందిన ఉస్మాన్, ఇస్మాయిల్, అహమ్మద్, నజీర్, బాలయ్యలకు కిషన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహ్మా, రవీందర్‌రెడ్డి, షరీఫ్, దానయ్య, యాదయ్య, బషిరెడ్డి, మైసయ్య పాల్గొన్నారు.